


# ఊరు పిచ్చుకలు

**- కాసుల ప్రతాపరెడ్డి**

సంధ్యకు నిద్ర పట్టడంలేదు. పడకపై అటూ ఇటూ దొర్లుతుంటే భర్త సురేష్ విసుక్కున్నాడు.

"మరేం చేయను, నిద్ర రావడంలేదు" అన్నది కోపంగా.

పగటిపూట పడుకోవడం మానేయి అని చెప్తే వినవు" అన్నాడు కోపంగా.

"పగటిపూట నేనేం పడుకోవడంలేదు" అంది.

మంచంపై లేచి కూర్చున్నాడు సురేష్. ఆమె వెల్లకిలా తలకింద చేతులు పెట్టుకుని పడుకునే వుంది.

వారిద్దరూ చాలాసార్లు అట్లా పోట్లాడుకుంటూనే వుంటారు. మళ్లీ కలిసిపోతారు. ఒకరి అవసరాలను మరొకరు కనిపెట్టుకుంటూ వుంటారు. వీళ్ల పద్ధతి చాలా విచిత్రంగా వుంటుంది. చూసేవాళ్లకు వీళ్లి ద్దరూ చిన్నప్పటినుంచి కలిసే వుంటున్నా రేమో అనిపిస్తూ వుంటుంది. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనే భావన వారిలో మానసికంగానే రూపుదిద్దుకో లేదు. బహుశా, పెళ్లయిన మర్నాటి నుంచే అంతరాలు కనిపించే కుటుంబ వ్యవస్థలో కాకుండా ఇద్దరే ఉండడం కారణమేమో!

"రాత్రుళ్లు నిద్రపోనీయవు. దాంతోటి ఆఫీసులో నిద్రొస్తున్నది. కూర్చొట్లు పడుతుంటే ఎవరైనా చూస్తున్నారేమో నని సిగ్గుతో చచ్చిపోతున్నాను. ఎంత ఆపుకుందామన్నా ఆగడంలేదు. నువ్వు చూస్తేనేమో ఇలా? ఇరవై రోజుల నుంచి ఇదే వరుస. అయినా పగటి పూట పడుకోకపోతే రాత్రుళ్లు ఎందుకు నిద్ర రాదు, చెప్పు" అన్నాడు కోపంగా.

"పగలు పడుకోవడానికి కూడా టైముంటుందా? మీరు ఆఫీసుకెళ్లిన తర్వాత ఎంత పనుంటుందో మీకేమెరుక? ఎప్పుడైనా చూస్తే తెలుస్తుంది" అంది లేచి కూర్చుంటూ.

"ఇంతకుముందు మొద్దు నిద్రపోయేదానివి. ఏమైంది నీకు?" అన్నాడు.

"నా బాధ నీకర్థం కాదు" అంది.

"నిద్ర పట్టనంత బాధలేమొచ్చినయో" అన్నాడు వ్యంగ్యంగా.

"నువ్వంత వెక్కిరించాల్సిన అవసరమేమీ లేదు. నా బాధేదో నాది. వద్దంటే అది కాల్ సెంటర్‌లో చేరింది. అర్ధరాత్రి, అపరాత్రి అనకుండా పోవడం, రావడం.. ఆడ పిల్ల... ఎప్పుడేమవుతుందో తెలియదు" అంది.

"ఏమైతది? ఏం కాదులే.. నువ్వు శుభ్రంగా నిద్రపో!" అని పడుకుని దుప్పటి కప్పుకున్నాడు.

"మీ చెల్లెలే అయితే ఇంత ధీమాగా నిద్రపోయేవారా? మా చెల్లెలు కాబట్టి మీరలా ఉండగలుగుతున్నారు" అంది.

సురేష్‌కు కోపం ఆగలేదు. దుప్పటి విసురుగా పడేసి లేచి కూర్చున్నాడు.

"నువ్వు నా సహనాన్ని పరీక్షిస్తున్నావు. రాత్రి నిద్రలేక పోవడంవల్ల ఎంత ఇబ్బంది అవుతున్నదో నువ్వు గుర్తిం చడం లేదు. నాకన్నా నీ చెల్లెలే నీకు ఎక్కువైంది. అయినా ఎంతమంది ఆడపిల్లలు కాల్ సెంటర్ ఉద్యో గాలు చేయడంలేదు. మీ చెల్లె ఒక్కతే చేస్తు న్నదా?"అంటూ మంచంపైనుంచి దిగి సిగరెట్టు పాకెట్ అందుకుని ఇవతలికి వచ్చాడు. పిల్లల గదివైపు చూశాడు. తలుపేసి వుంది. గాఢంగా నిద్రపోతున్నట్లున్నారు.

అతనితోపాటు ఆమె ఇవతలికి వచ్చింది. బాల్క నీలో నిలబడి సిగరెట్టు అంటించి పీల్చసా గాడు.

"సిగరెట్టు తాగడానికే నువ్వు నాతోటి తగాదా పెట్టుకుంటావు. నీకు అదోటి ఉంది. మా ఆడవాళ్లకేముంది?"

"నీతోటి ఇదో రకమైన యాతన. కావా లంటే నువ్వు తాగరాదూ" అలా అన్నాడే కానీ భార్య సిగరెట్టు తాగితే తాను సహించగలనా అని అతను ఆలోచించలేదు.

సంధ్య చెల్లె సుష్మ హైదరాబాద్‌కు వచ్చి ఓ కాల్ సెంట ర్‌లో ఉద్యోగంలో చేరింది. ఆ ఉద్యోగం వద్దని సంధ్య ఎంత చెప్పినా వినలేదు. అర్ధరాత్రి, అపరాత్రి అనకుండా కారులో పోవడం, కారులో రావడం... కారు డ్రైవర్ ఎట్లా ఉంటాడో తెలియదు. ఆమె వెంట వచ్చే ఉద్యోగి ఎలాంటివాడు ఉంటాడో తెలియదు. ఎప్పుడు ఏమవుతుందో తెలియదు. మగవాళ్లను నమ్మ డానికి వీల్లేదు. రాత్రుళ్లు ఆఫీసులో బాస్ ఎలా వుంటాడో, సహోద్యోగులు ఎలా వుంటారో అసలే తెలియదు. పైకి అందరూ మంచివాళ్ల లాగానే కనిపిస్తారు. హైదరాబాద్‌లో పక్క మని షికి ఏమైనా అయినా కూడా పట్టించుకోరు. తమకు ఏమీ జరగలేదు, అంతే చాలనుకుంటారు. ఇవీ సంధ్య కున్న భయాలు.

గబగబా సిగరెట్టు తాగేసి "మీ చెల్లెకేమీ కాదు, శుభ్రంగా వస్తుంది. వచ్చి పడుకో!" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"లెఫ్ట్ మూవ్‌మెంటులో పనిచేశానని గొప్పలు చెప్పు కుంటావు. ఇదేమిటి?" అన్నాడు ఆమెను ఉడి కిస్తూ.

"అదీ ఇదీ ఒక్క టేనా?"అంది కోపంగా ఆమె.

"చూడు తల్లీ! మనం చెప్పేవాటిని కూడా జీవి తానికి అన్వయించుకో వాలి. లేకుంటే ఏ ఉద్య మంలో పనిచేసినా ఉత్తదే అవుతుంది" అన్నాడు.

"నువ్వేం బనాయించ క్కల్లేదు" అంది.

"బనాయించడం కాదు, పురుషాధిపత్యం గురించి మాట్లాడేవారికన్నా ఇలా కాల్ సెంటర్లలో పనిచేసే అమ్మా యిలే గొప్పవాళ్లు."

"నేనొవైపు హడలి చస్తుంటే నీకంతా జోకైంది" అంది.

"ప్రతిదానికీ ఆందోళనపడడం మానుకోమనే... నీకు మొదటినుంచీ నేను చెప్పేది. ప్రతి దాన్నీ భూతద్దంలో చూస్తావు".

"అదే నీ చెల్లెనో, బిడ్డనో ఇట్లే మాట్లాడతావా?"అని ప్రశ్నించింది.

"చూడమ్మా! అమ్మాయిని ఇంటివద్ద దింపేటప్పుడు కారులో సంస్థ ఉద్యోగి ఉంటాడు. ఏ టైములో ఆఫీసు నుంచి బయలుదేరింది, ఏ టైములో ఇంటివద్ద దింపింది అన్ని వివరాలు రాసుకుంటాడు. మీ ఒక్క చెల్లె ఒక్కతే కాదు, చాలామంది అమ్మాయిలుంటారు" అన్నాడు.

ఉగాది పోటీలో ఎంపికైన కథ

"ఎప్పుడైనా కారులో ఒంటరిగా వుంద నుకో. ఆ ఉద్యోగి, కారు డ్రైవరే కలిసి ఏమైనా చెయ్యరని నమ్మకమేంది?" అన్నది.

"అలా భయపడుతూ కూర్చుంటే ఏమీ చేయలేం. నీదొట్టి ఫోబియా. రాత్రిపూటనే కాదు, ఎప్పు డైనా ఏమైనా జరగడానికి అవకాశం వుంటుంది. అలా అనుకున్నదానివి నీ చెల్లెని 24గంటలు ఇంట్లోనే కూర్చో బెట్టుకోనుంటివి" అన్నాడు చిరాగ్గా.

"నేనంటే నీకెప్పుడూ చులకనే, పిసరంత ప్రేమకూడా లేదు. నేను బాధపడుతుంటే నీకు నవ్వులాటగా ఉంటుంది"అని ఫిర్యాదుచేసింది.

"నేను సీరియస్‌గానే చెబుతున్నా. నువ్వు వచ్చి పడుకో. లేదంటే నీ యిష్టం"అంటూ లోపలికి వెళ్లి పోతూ వెనక్కి చూశాడు. ఆమె అతని మాటలను పట్టించుకున్నట్లే లేదు. ఆమె పక్కనుంటే తప్ప సురేష్‌కు నిద్ర పట్టదు. అదో బాధ. నిద్రపోయేంత వరకు ఆమె పక్కనుండాల్సిందే. ఇదెలా అలవాటయిందో, తలుచుకుంటే ఘోరంగా వుంటుంది. ఎప్పుడైనా ఆమెకు దూరంగా వుండాల్సి వచ్చినప్పుడు ఓ రెండు పెగ్గుల విస్కీ తాగితే మత్తు ముంచుకొస్తుంది. ఏమీ తెలియకుండా నిద్రపోతాడు. తాగడం వ్యసనం కాదు గానీ అతనికి అవసరంగా మారింది.

కాస్తా ఆగి "వస్తావా, రావా?" అన్నాడు విసురుగా. ఆమెకు కోపం వచ్చిందని, తనకు సమాధానం రాదని గుర్తించి లోనికి వెళ్లిపోయాడు.

ఏమీ తోచక రోడ్డువైపు చూస్తూ వుండిపోయింది సంధ్య. వీధి లైట్లు మసగ మసగ్గా వెలుగుతున్నాయి. దర్వాజా దాకా వచ్చి గోడ గడియారం చూసింది. అర్ధరాత్రి దాటి మూడవుతున్నది. సుష్మ రావడానికి ఇంకా గంట టైముంది. నిన్న మొన్న పడక మీద దొర్లుతూ సగం సగం నిద్రన్నా పోయేది. ఈరోజు ఈయనొక్కడు... లేచి గొడవ మొదలుపెట్టాడు, పూర్తిగా నిద్ర తేలిపోయింది అని అనుకుంది.

వచ్చి కాసేపు ముందు గదిలో కుర్చీలో కూర్చుంది. లేచి కిందనే నడుం వాల్చి నిద్రపోయే ప్రయత్నం చేసింది. నిద్ర దరి చేరదని అర్థమై మళ్లీ బాల్కనీలోకి వచ్చి నిలబడింది.

ఇంతలో రోడ్డుమీద చీపుర్లతో ఆడవాళ్లు కనిపించారు. రోడ్డు ఊడ్చడం మొదలుపెట్టారు. ఈమధ్య అర్ధరాత్రి దాటిన తర్వాత రోడ్లు ఊడుస్తున్నారు. ఎందుకో... అనుకుంది. తను హైదరాబాద్‌కు వచ్చిన కొత్తల్లో ఇలా వుండేది కాదు. కాల్ సెంటర్లు ఎందుకు వచ్చాయో, రాత్రి పూట రోడ్లు ఊడ్చడం కూడా అందుకే వచ్చిందని ఆమె బుర్రకు అందని విషయం.

అలా బాల్కనీ నుంచి చూస్తుంటే వాళ్ల ముఖాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాళ్లలో ఒకామె లక్ష్మిలాగా కనిపించింది. లక్ష్మి ఇక్కడికెందుకొస్తుంది, ఎవరినో చూసి తాను లక్ష్మి అని అనుకుంటున్నాదేమో... అని మనసులో అనుకుంది. అలాగే చూస్తూ ఉండిపోయింది. చూస్తున్నకొద్దీ ఆమె లక్ష్మిలాగే కనిపించసాగింది. లక్ష్మి సంధ్యకు బాగా తెలుసు. తమ అత్తగారి వూరే ఆమెది. తన పెళ్లప్పుడు తన పక్కనుండి అన్నీ ఆమెనే అరుసుకున్నది. అప్పుడప్పుడే ఆమెలో యౌవనం ప్రవేశిస్తున్నది. ఆ సిగ్గరితనం చాలా గమ్మత్తుగా, అమాయకంగా వుండేది. ఛామనచాయే అయినా చాలా అందంగా వుంటుంది. అప్పుడు లక్ష్మికి ఇరవై యేళ్లుంటాయేమో! నాలుగేళ్ల కిందటే పెళ్లయింది. లక్ష్మి ఆలోచనలతో సంధ్య కాసేపు తన చెల్లెలి గురించి మర్చిపోయింది. దాదాపుగా పరిసరాలను కూడా మర్చిపోయింది. చిమ్మచీకటిలో నియోన్ లైట్ల వెలుతురు గుడ్డిగుడ్డిగా, ఈ లైట్ల వెలుతురులో పరిసరాలు దుమ్ము పట్టిన కళ్లద్దాలనుంచి చూస్తున్నట్లు కనిపిస్తాయి.

లక్ష్మి భర్త రాములు, తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. ఎకరం తరిపొలం, మూడెకరాల మెట్ట ఉంది. రాములు కష్టపోతు. వ్యవసాయం బాగా చేస్తాడని ఊరంతా అనుకుంటుంది. రాములు పొలం పండలేదంటే ఇక ఎవరి పొలం పండదు. బావి మీద పండే పంటతో హాయిగా వుండేవాళ్లు. అటువంటి కుటుంబంలో వున్న లక్ష్మి ఇక్కడికొచ్చి రోడ్లెందుకు ఊడుస్తుంది? మనిషిని పోలిన మనసు ఉండటం సహజం. తాను ఎవరినో చూసి లక్ష్మి అనుకుంటున్నట్లున్నానని భావించింది. అక్కడికి వెళ్దామా అని అనుకుని కదలబోయి తటపటాయించింది. గేటు తీసుకుని బయట కాలు పెడితే చాలు. ఏమైనా అది అయిందని బయటకు నడిచింది.

గేటు తీసి నిలబడింది. తన ఉనికిని కూడా గుర్తించకుండా వాళ్లు రోడ్లు ఊడ్చుకుంటూ పోతున్నారు. ఒకతను బైక్‌మీద పోతూ ఆమెను ఏదోలా చూశాడు. దాంతో ఆమెకు మళ్లీ చెల్లె సుష్మ గుర్తొచ్చింది ఆందోళన కలిగింది. రోడ్డుమీద పోయేవాళ్లే ఆడవాళ్లను చూస్తే మింగేసేలా చూస్తారే, పరాయి మగవాళ్లుండే కారులో వస్తే ఏమాత్రం రక్షణ వుంటుందని అనుకుంది.



అలా బాల్కనీ నుంచి చూస్తుంటే వాళ్ల ముఖాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాళ్లలో ఒకామె లక్ష్మిలాగా కనిపించింది. లక్ష్మి ఇక్కడికెందుకొస్తుంది. ఎవరినో చూసి తాను లక్ష్మి అని అనుకుంటున్నాదేమో... అని మనసులో అనుకుంది. అలాగే చూస్తూ ఉండిపోయింది. చూస్తున్నకొద్దీ ఆమె లక్ష్మిలాగే కనిపించసాగింది.

ఊడ్చుకుంటూ ఊడ్చుకుంటూ దగ్గరికొచ్చిన లక్ష్మి ఒకసారి తలెత్తి సంధ్యను చూసింది. అలా చూసి ఆశ్చర్యపోయింది. "మీరిక్కడ వుంటరా?"అని కుతూహలంగా అడిగింది. అప్పుడు లక్ష్మిని స్పష్టంగా గుర్తించింది సంధ్య.

"నువ్వేంది లక్ష్మీ! ఈ పని?" అడిగింది సంధ్య. లక్ష్మి ముఖంలో ఆనాటి కళ లేదు. మనిషిలో ఆనాటి చలాకీతనం లేదు. తాను చూసినప్పుడు ఎంత చురుకుగా ఉండేదని, రెక్కలు విప్పార్చుకున్న పక్షిలా అనిపించేది తనకు.

ఆ ప్రశ్నతో లక్ష్మి ముఖం నల్లబడ్డింది. పీక్కుపోయిన ముఖం మరింత కళావిహీనమైంది. ఏవేవో మదిలో మెదిలి మెలిపెడుతుంటే బాధపడుతున్నట్లు లక్ష్మి కనిపించింది. ఏదో జరగరానిదే జరిగిందని సంధ్య అనుకుంది. తన పిచ్చిగానీ ఏదీ జరగకపోతే ఈ రోడ్లు ఊడ్చే పనికి ఎందుకు కుదురుతుందని జవాబు చెప్పుకుంది.

"ఏమైంది లక్ష్మీ?" అని అనునయంగా అడిగింది.

ఆ ప్రశ్నతో లక్ష్మి కళ్లనిండా నీరు ఊరింది. చీపురు కింద పడేసి కొంగుతో కళ్లు తుడుచుకుంది. "ఆయన చచ్చిపోయిండు" అని చెప్పింది అతి కష్టంగా. సంధ్య మాట్లాడలేకపోయింది. "వద్దంటే పత్తి వేసిండు. అప్పు తెచ్చి లాగోడి పెట్టిండు. పంట చేతికందలేదు. అంతా తీన్‌తెర్లయింది. అప్పులోల్లు ఎంట పడుతుండె. చూసి చూసి ఓరోజు పురుగుల మందు తాగిండు. అప్పటికే అత్తమామలు చనిపోయిండ్రు. ఉన్న భూమి అప్పులు కట్టిన. అక్కడ ఉండలేక ఇక్కడికొచ్చిన" చెప్పింది. పరిస్థితి సంధ్యకు అర్థమైంది.

ఇంతలో ఒకతను అక్కడికి వచ్చి దూరంగా నించున్నాడు. ముఖం స్పష్టంగా కనిపించడం లేదు. కానీ బలిష్టంగా వున్నాడు. 20, 25 యేళ్ల వయస్సుంటుందేమో! అతన్ని చూడగానే లక్ష్మి వెళ్లింది. సంధ్య అలాగే నిలబడింది. అతను లక్ష్మితో ఏదో మాట్లాడుతున్నాడు. ఏం మాట్లాడుతున్నాడో వినిపించడం లేదు. రోడ్లు ఊడుస్తున్న స్త్రీలు చీపురు కట్టలు పట్టుకొని ఒక్కరొక్కరే అక్కడికి చేరుకుంటున్నారు. అతను ఏదో దబాయిస్తున్నట్లున్నాడు. లక్ష్మి నచ్చజెప్పే పద్ధతిలో ఏదో మాట్లాడుతున్నట్లు అనిపించింది.

అక్కడి దృశ్యం చూసి ఒక్కసారిగా ఆశ్చర్యపడింది సంధ్య. వచ్చిన యువకుడ్ని స్త్రీలందరూ కలిసి చీపుర్లతో కొడుతున్నారు. కొడుతూనే ఏదేదో తిడుతున్నట్లు సంధ్యకు అర్థమవుతున్నది. అతను వారిని ప్రతిఘటించే ప్రయత్నం చేస్తున్నాడు. వారి ధాటికి తట్టుకోలేక అతను కింద పడిపోయాడు. సంధ్య తన ప్రమేయం లేకుండానే అక్కడికి వెళ్లింది.

"ఆమె జోలికి రాను. నన్ను వదిలివేయండి" అని బతిమాలుతున్నాడు. దండం కూడా పెట్టాడు.

"పోనీయండ్రే"అని ఒకామె అన్నది.

అతన్ని వదిలేశారు. అతను తల వంచుకొని వెళ్లిపోయాడు.

సంధ్య లక్ష్మి దగ్గరకు వెళ్లి "ఏమైంది లక్ష్మీ?" అని అడిగింది.

ఆ ప్రశ్నకు గుంపులోని ఓ స్త్రీనుంచి సమాధానం వచ్చింది. "ఈ సుబ్బారావుగాడు రోజొచ్చి ఈ పోరిని సతాయిస్తున్నడు. మొగుడు లేడని దానెంట బడుతున్నడు. నేనే ఈ పోరిని తీసుకొచ్చి ఈ పనిల పెట్టిన. మాకు పనిచ్చిన సార్ దగ్గర ఈడు పనిచేస్తడు. వీడి కన్ను ఈ పోరి మీద పడ్డది. రోజూ వచ్చుడు సతాయించుడు. గతిలేక రోడ్లు ఊడుస్తున్నం గని నీతి లేక కాదు కదమ్మా! గందుకనే ఆడికి బుద్ధిచెప్పాల్నని అనుకున్నం. ఊరిపిస్కెలుకున్నడు, ఆడి మొల్తాడు తెగ. ఆడ్ని గద్దలెత్తుకపోను. ఊరిపిస్కెలు కల్సొ ఎట్లుంటదో ఆడికి తెల్వాలే ఇన్నాళ్ల సంది." ఆమెకు ఆమెనే సమాధానం చెప్పుకుంటున్నదో, తన ప్రశ్నకు సమాధానం చెప్తున్నదో సంధ్యకు అర్థంకాలేదు. ఇంతలో కారు వచ్చి పక్కనే ఆగడంతో ఉలిక్కిపడింది సంధ్య.

అందులోంచి సుష్మ డోర్ తీసుకుని పరుగులాంటి నడకతో సంధ్యను చేరుకుంది.

"ఏమైందే? ఇక్కడున్నావు?"అని అడిగింది సుష్మ ఆత్రుతగా.

"ఏం కాలేదు. ఏం కాదు" అని అని సుష్మ వీపును తట్టింది సంధ్య.

ఏం కాలేదనే మాట సరే, ఏం కాదనే మాట అక్క ఎందుకు వాడిందో సుష్మకు అర్థంకాలేదు.

తన నోటి వెంట ఆ మాటెందుకు వచ్చిందో సంధ్యకు అర్థమైంది. చెల్లెలి విషయం ఆమె ఇప్పుడు మనసు కుదుటపడింది.

సుష్మను దింపేసిన కారు వెళ్లిపోయింది.

అక్కాచెల్లెలిద్దరూ ఇంటి వైపు నడకసాగించారు.

ఇంటివైపు చూశారు. సురేష్ సిగరెట్టు కాలుస్తూ కనిపించాడు. సుష్మ 'హాయ్, బావా!' అంటూ చేయి ఊపింది.

సంధ్య హాయిగా నవ్వుకుంది.

★